క్లుప్తంగా

భవిత కేంద్రాన్ని సందర్శించిన ఏపీసీ

మామిడికుదురు: నగరంలో భవిత కేంద్రాన్ని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ జి.మమ్మీ, సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం గురువారం సందర్శించారు. విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. వారికి భవిత కేంద్రంలో అందుతున్న సదుపాయాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందించిన కిట్లు సక్రమంగా అందాయా లేదా అన్న అంశాన్ని పరిశీలించారు. భవిత కేంద్రంలోని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. భవిత కేంద్రాల్లోని విద్యార్థులు సులభంగా ఆకళింపు చేసుకునేలా బోధన చేయాలన్నారు. వారి వెంట ఎంఈఓ మోకా వెంకన్నబాబు, ఐఈఆర్పీలు కె.సుశీల, ఎస్.బిందు ఉన్నారు.

హస్త కళలపై అవగాహన


అవగాహన సదస్సులో స్టాల్‌ను పరిశీలిస్తున్న ప్రముఖులు

మామిడికుదురు: పాశర్లపూడిలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినిలకు హస్త కళలపై మూడు రోజుల ఉచిత అవగాహన సదస్సు గురువారం ప్రారంభమైంది. దీనిలో భాగంగా పలు రకాల కళాత్మక బొమ్మల తయారీపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా స్టాల్ ఏర్పాటు చేశారు. స్కూల్ హెచ్ఎం ఎస్.రాధ అధ్యక్షతన జరిగిన సభలో గ్రామ సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ చక్కటి సదావకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇటువంటి అవగాహన తరగతులు జరగడం ముదావహమన్నారు. విద్యార్థి దశలో ఈ తరహా కార్యక్రమాల నిర్వహణ ద్వారా ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. బొరుసు తిరుమలరావు, తెలగారెడ్డి బులి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీను కుటుంబ సభ్యులకు పరామర్శ


మోరిపోడులో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కిశోర్


సఖినేటిపల్లి: మోరిపోడులో ఇటీవల గుండెపోటుతో ఆకస్మిక మృతి చెందిన వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీను కుటుంబ సభ్యులను గురువారం ఆ పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం అధికార ప్రతినిధి తెన్నేటి కిశోర్ పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైఎస్సార్ సీపీ కేడర్ ఎప్పుడూ అండగా ఉంటుందని కిషోర్ వారికి హామీ ఇచ్చారు. వెంట పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గల్ఫ్ యువనేస్తం సేవలు అభినందనీయం


యువనేస్తం ఆర్థిక సాయం అందిస్తున్న శివకుమార్

రాజోలు: గల్ఫ్ యువనేస్తం సేవా సమితి సేవలు అభినందనీయమని రాష్ట్ర నెడ్‌క్యాప్ మాజీ డైరెక్టర్ పాటి శివకుమార్ గురువారం అన్నారు. ఇటీవల పొదలాడ గ్రామానికి చెందిన మొల్లేటి నాగరాజు గల్ఫ్‌లో గుండెపోటుతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి గల్ఫ్ యువనేస్తం రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని అందజేసింది. ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకుంటున్న యువనేస్తం సేవలను పలువురు కొనియాడారు. సర్పంచ్ కడలి సత్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ కె.సత్యనారాయణమూర్తి, నాయకులు కె.చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులు ప్రారంభం


రహదారి పనులు చేస్తున్న సిబ్బంది

సఖినేటిపల్లి: స్థానిక సత్తిరేవు పుంత రహదారి అభివృద్ధి పనులు గురువారం ఆర్అండ్‌బీ అధికారులు ప్రారంభించారు. ఎంపీ నిధులతో ఈ రహదారి పనులను అధికారులు చేపట్టారు.

పాము కాటుకు వివాహిత మృతి

ముమ్మిడివరం: నగర పంచాయతీ శివారు రాజుపాలెం గ్రామానికి చెందిన యనమదల ప్రవల్లిక (27) పాము కాటుకు గురై మృతి చెందింది. గురువారం ఉదయం రాజుపాలెం గ్రామ ప్రధాన రహదారిపై వాకింగ్ చేస్తుండగా పాము కాటు వేసింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు ఎస్సై డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలిబాటలతో ప్రయోజనాలెన్నో..

- వరి చేలల్లో కాలిబాటలతో అధిక లాభం
- రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు


మొసలపల్లిలో కాలి బాటలతో వరి నాట్లు వేసిన రైతులు

అంబాజీపేట: ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నారు. రైతులు పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. పంటను కాపాడుకునే విధానాన్ని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. వరి చేను ఊడ్చిన తరువాత పొలంలో ప్రతి రెండు మీటర్లకు కాలిబాట వేయడం వలన రైతులకు అధిక ప్రయోజనం ఉంటుంది. పైరు వేరు భాగానికి విస్తారంగా గాలి, సూర్యరశ్మి తగలడం, చీడ, పీడల సమస్య తగ్గడం, ఎరువులు, పురుగు మందులు చల్లే సమయంలో దారి సమస్య తగ్గడంతోపాటు ప్రతి ఎకరాకు మూడు, నాలుగు బస్తాలు అదనంగా పండి రైతులకు లాభాన్ని ఆర్జించవచ్చు.

రైతుల్లో ఆసక్తి

గతంలో చాలా మంది రైతులు కాలిబాటలు వేయడం అదనపు ఖర్చుగా భావించేవారు. దీనిపై ఆసక్తి చూపించేవారు కాదు. వ్యవసాయాధికారులు కాలిబాటల ప్రయోజనాన్ని రైతులకు విస్తృతంగా వివరించడంతో రైతులంతా కాలిబాటలు వేస్తున్నారు. మూడు నియోజకవర్గాలకు సంబంధించి పి.గన్నవరంలో 25,382, కొత్తపేటలో 34,706, రాజోలులో 8,650 ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. కాలిబాటలు వేసే సమయంలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. ప్లాస్టిక్ లేదా డొక్కతాడు తీసుకుని నేను గట్టు అవతలి వైపు నుంచి ఇవతలి వైపు వరకు బాగా సాగదీసి కట్టాలి. తాడు వెంబడి 12 సెంటీమీటర్లు వెడల్పున వరి నాట్లు సాగులో ఉన్న వరిచేను తొలగించి పక్కనే పలుచగా ఉన్న ప్రదేశంలో నాటుకోవాలి. వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తే విత్తనాలు చల్లిన తరువాత 15 నుంచి 20 రోజుల వ్యవధిలో కాలిబాటలు వేసుకోవాలి.

లాభాలెన్నో..

కాలిబాట వేయడంతో వేరు మొదళ్లకు గాలి, వెలుతురు, సూర్యరశ్మి విస్తారంగా తగులుతుంది. దీంతో పైరు ఆరోగ్యంగా ఎదుగుతుంది. చీడపీడల బెడద కొంతవరకు తగ్గుతుంది. కాలిబాట మార్గంలో వెళ్లి కలుపు తొలగించడానికి, మందులు చల్లడానికి వీలు కలుగుతుంది. తెగుళ్లను సులభంగా గుర్తించడానికి, సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి ఎలుకలను నివారణకు వీలవుతుంది. తుపానులు, భారీ వర్షాలు వంటి ప్రకృతి విపత్తులు ఏర్పడిన సమయంలో పైరులో కిరణజన్య సంయోగ క్రియ సమర్థవంతంగా జరిగి దిగుబడి తగ్గకుండా ఉంటుంది. పైరులో చీడ పీడల ఉధృతిని దగ్గరగా గమనించి, దానికి అనుగుణంగా సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి వీలవుతుంది.

అవగాహన కల్పించాలి



ఒక ఎకరం పొలంలో కాలిబాటలు వేయడానికి సుమారు రూ.800 ఖర్చు అవుతుంది. కాని కాలిబాటలు వేయడం వల్ల నాలుగు బస్తాల వరకు అధిక దిగుబడి రావడమే కాకుండా పంట కాలంలో చేను మొత్తం తిరగడానికి అనువుగా ఉంటుంది. దీనిపై మా సిబ్బందితో రైతులకు అవగాహన కల్పించడంతో ఇప్పుడు రైతులంతా కాలిబాటలు వేస్తున్నారు.

– కె.ధర్మప్రసాద్, మండల వ్యవసాయాధికారి, అంబాజీపేట

ఉపాధి మేట్ల సమావేశం



సఖినేటిపల్లిలో నిర్వహించిన ఉపాధి మేట్ల సమావేశం

సఖినేటిపల్లి: స్థానిక పంచాయతీ వద్ద గురువారం మండల పరిధిలోని ఉపాధి హామీ పథకం మేట్ల సమావేశం జరిగింది. సమావేశానికి మేట్ సూరంపూడి రాజ్యలక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధి కూలీల సంఘ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, నేషనల్ మొబైల్ మానెటరింగ్ సిస్టం వచ్చిన తరువాత మేట్లకు అదనపు బాధ్యతలు పెరిగాయని చెప్పారు. పెరిగిన బాధ్యతలకు తగ్గట్టుగా అదనపు సౌకర్యాలు కల్పించకపోవడం శోచనీయమన్నారు. కాగా మేట్లకు నెలకు రూ.2 వేలు చొప్పున గౌరవ వేతనం ఇవ్వాలని, కూలీలకు వేతనాలు తక్షణమే చెల్లించాలని, ఉపాధి మేట్లకు సెల్ సౌకర్యంతో పాటు, రీచార్జి ఖర్చులు ప్రభుత్వమే భరించాలని తీర్మానించారు. ఇదిలా ఉండగా ఉపాధి మేట్లు నూతన కార్యవర్గం ఎంపిక చేశారు. అధ్యక్షురాలుగా చిట్టూరి నిర్మల కుమారి, ప్రధాన కార్యదర్శిగా చింతా హేమలత, ట్రెజరర్‌గా బళ్ళ నాగమణి ఎంపికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులు, కార్యదర్శులుగా ముగ్గురు చొప్పున, పన్నెండు మంది కార్యవర్గ సభ్యులు ఎన్నుకున్నారు.

వైభవంగా ద్వాదశ ప్రదక్షిణలు


ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీస్వామి వారి ఆలయంలో అయిదు రోజులు ఘనంగా జరిగిన అధ్యయనోత్సవాలు గురువారం ద్వాదశ ప్రదక్షిణలతో ముగిశాయి. కార్యక్రమాల్లో భాగంగా అయిదు అధ్యయనోత్సవాలను వైభవంగా జరిపించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఉప ముఖ్య అర్చక గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో కె.కృష్ణమాచార్యులు, ఎస్‌టీపీ రామానుజాచార్యులు, సీవీఎస్ సాయిరామ్, ఎస్.వెంకటాచార్యులు అధ్యయనోత్సవాలను కన్నుల పండుగలా చేశారు. ఆలయ ఈఓ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ పూజా కార్యక్రమాల్లో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీల నియామకంతో నూతనోత్సాహం


ములికిపల్లి గ్రామ కమిటీకి నియామక పత్రాన్ని అందిస్తున్న పార్టీ పరిశీలకులు


రామేశ్వరంలో వైఎస్సార్ సీపీ గ్రామ నూతన కమిటీ సభ్యులతో ప్రముఖులు

రాజోలు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీల నియామకంతో పార్టీ కార్యకర్తల్లో నూతనోత్సాహం వచ్చిందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నూతన కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గురువారం మండలంలోని ములికిపల్లి గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కూనపురెడ్డి రాంబాబు, ప్రచార కమిటీ చైర్మన్ మద్దుల కాసుబాబు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లాబత్తుల సతీష్‌బాబుల ఆధ్వర్యంలో కమిటీలను నియమించారు. ములికిలిపల్లి గ్రామశాఖ అధ్యక్షుడిగా దొమ్మేటి సత్యప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కత్తిమండ సురేష్‌లు ఎన్నికయ్యారు. మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గుబ్బల నారాయణరావు, మాజీ సర్పంచ్ తాడి వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ అధ్యక్షురాలు ముద్దాడ సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వరం గ్రామ కమిటీ ఎంపిక

సఖినేటిపల్లి: వైఎస్సార్ సీపీ రామేశ్వరం గ్రామ నూతన కమిటీ ఎంపిక గురువారం జరిగింది. రాజోలు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు సూచనలతో సర్పంచ్ కట్టా ఉమా మహేశ్వరరావు అధ్యక్షతన కమిటీ ఎంపిక చేశారు. నూతన అధ్యక్షుడిగా చెల్లింగి నాగరాజు, ప్రధాన కార్యదర్శులుగా దీపాటి రాజేష్, లోటుకుర్తి సుబ్బరాజు ఎన్నికయ్యారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, మాజీ నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, రాష్ట్ర, జిల్లా, మండల వివిధ విభాగాల పార్టీ ప్రతినిధులు రుద్రరాజు చినరాజా, తాడి సహదేవ్, దొంగ ఏసు, ఈద రవిరెడ్డి, దివ్వి చిట్టిబాబు, మాజీ సర్పంచ్ సరెళ్ల విజయ్ ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు గన్నవరపు పరామర్శ


కుందాలపల్లిలో పినిశెట్టి శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న కో ఆర్డినేటర్ గన్నవరపు

పి.గన్నవరం: కుందాలపల్లి గ్రామంలో సోదర వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు పినిశెట్టి శ్రీనివాస్‌ను నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు గురువారం పరామర్శించారు. పినిశెట్టి శ్రీనివాస్ సోదరుడు నారాయణ స్వామి ఇటీవల మృతి చెందారు. పినిశెట్టిని పరామర్శించిన వారిలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు యన్నాబత్తుల ఆనంద్, నాయకులు పేరిచర్ల కుమార్‌రాజు, మెల్లం మహాలక్ష్మి ప్రసాద్, దొమ్మేటి దుర్గారావు, జల్లి పండు, కాత్రు వెంకటేశ్వరరావు, రాయుడు చిన్న తదితరులు ఉన్నారు.

శాకంబరిగా విజయ దుర్గాదేవి అమ్మవారు



కొత్తపేట: స్థానిక చినగూల్లపాలెం విజయ దుర్గాదేవి అమ్మవారు గురువారం శాఖంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢమాసం అమావాస్య సందర్భంగా అమ్మవారిని ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో అమ్మవారిని కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతో విశేషంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. చినగూళ్లపాలెం, పెదగూళ్లపాలెం, కొత్తపేట తదితర ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శాకంబరిగా రావులమ్మ


రావులమ్మవారికి సారె సమర్పిస్తున్న ఆలయ ఈజీ, భక్తులు



గంగలకుర్రులో రావులమ్మకు సమర్పించిన సారె

అంబాజీపేట: గంగలకుర్రు గ్రామ దేవత రావులమ్మ అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసం సందర్భంగా గురువారం అమ్మవారికి సారె సమర్పించారు. అమ్మవారికి బూరెలు, గారెలు, అరిసెలు, పులిహోర, పెసర పప్పు, చలివిడి, దద్దోజనంతో పాటు లడ్డు, కాజా, పాయసం తదితర సుమారు 200 రకాల పిండి వంటలతో కూడిన సారె సమర్పించారు. సుమారు 200 కేజీలతో వివిధ రకాల కూరగాయలతో అమ్మవారికి అలంకరించారు. అమ్మవారి ఆలయానికి భక్తులు ర్యాలీగా తరలివెళ్లారు.

అమ్మవారికి సారె సమర్పణ

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయం తరఫున ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ కార్యనిర్వాహణాధికారి అల్లు దుర్గా భవాని ఆషాఢం సారె సమర్పించారు. ఈ సందర్భంగా అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయం నుంచి భారీగా గ్రామ ఆడపడులు, భక్తులు మంగళవాయిద్యాల నడుమ రావులమ్మ ఆలయానికి ఊరేగింపుగా వచ్చి పూజలు చేసి, వివిధ పండ్లు, పిండి వంటలు, స్వీట్లను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు మాచరి వినాయకరావు, ఆలయ వేదపండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్


కొత్తపేట శిల్పా గార్డెన్‌లో కాటన్ విగ్రహానికి కంకుల హారం వేస్తున్న శిల్పి రాజ్‌కుమార్


అంబాజీపేటలో కాటన్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

కొత్తపేట: అఖండ గోదావరి నదిపై ఆనకట్ట నిర్మించి ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో బీడు భూములకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేసి ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడుగా నిలిచారని ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డాక్టర్ డీ రాజ్ కుమార్ వుడయార్ అన్నారు. కాటన్ వర్ధంతి సందర్భంగా శ్రీనాథరత్నశిల్పి వుడయార్ శిల్పకళా సాంస్కృతిక సేవా సంస్థ, శిల్పా గార్డెన్‌లో సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి శిల్పి రాజ్‌కుమార్ వరి కంకుల హారం (దండ) వేసి ఘనంగా నివాళులర్పించారు. వాడపాలెంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు కాటన్‌కు ఘనంగా నివాళులర్పించారు.

సఖినేటిపల్లి: స్థానిక లాకులు వద్ద అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ వర్ధంతి గురువారం స్థానిక నీటి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు ఆయన విగ్రహానికి నీటి సంఘం అధ్యక్షుడు నామన నాగభూషణం పూలమాల వేసి నివాళులర్పించారు. నీటి సంఘ సభ్యులు పాల్గొన్నారు. మోరి మహిమ కోకోనట్ ప్రొడ్యూసర్స్ కంపెనీ కార్యాలయంలో రైతు సంఘాల ఆధ్వర్యంలో సర్ ఆర్థర్ కాటన్ వర్ధంతి నిర్వహించారు. రాజోలు తాలూకా సమష్టి వ్యవసాయ సహకార సంఘాల సమాఖ్య అధ్యక్షుడు గెద్దం ప్రభాకరరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా సమాఖ్య గౌరవ అధ్యక్షుడు ఓగూరి టాండన్ రాజు పాల్గొన్నారు. కాటన్ చిత్రపటానికి ప్రముఖులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. చింతా శేషు, రాపాక నానాజీ, తాడి ఆనందరావు, రామకృష్ణ, మేడిద ఏసయ్య, గెద్దం బాలరాజు, తాడి శివాజీ పాల్గొన్నారు.

అంబాజీపేట: విదేశీయుడే అయినా దుర్భిక్షంతో అల్లాడుతున్న తెలుగు ప్రజలను ఆదుకున్న ప్రత్యక్ష దైవం సర్ ఆర్థర్ కాటన్ దొర మహాశయుడని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. కాటన్ దొర వర్ధంతి సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న కాటన్ దొర విగ్రహం వద్ద గురువారం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, వాసంశెట్టి పెదబాబు, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎవీఎల్.నరసింహం, డిప్యూటీ ఎంపీడీఓ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అయినవిల్లి: నల్లచెరువు గ్రామంలో సర్ ఆర్థర్ కాటన్ వర్ధంతిని రైతు నాయకుల ఆధ్వర్యంలో గురువారం జరిపారు. కాటన్ మహాశయుడు చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన సేవలను పలువురు రైతులు వివరించారు. కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుండుమెగుల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ రావూరి వెంకటరామారావు, గణేశుల రాంబాబు, జి.తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ల వితరణ


కంప్యూటర్లు అందిస్తున్న దాత నారాయణప్ప

మలికిపురం: రామరాజులంక జెడ్పీ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ మేడిచర్ల నారాయణప్ప రూ.ఒక లక్ష విలువైన కంప్యూటర్లను విరాళంగా అందించారు. బుధవారం పాఠశాలలో ఈ మేరకు అందించారు. ప్రధానోపాధ్యాయిని కాశిబట్ల వెంకట రామ సుబ్బలక్ష్మికి అందించారు. కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ రావూరి రాజా రమేష్ పాల్గొని మాట్లాడుతూ దాతల ఔదార్యాన్ని అభినందించారు. కార్యక్రమలో ఉపాధ్యాయులు బేతినీడి శ్రీనివాస్, యేపుగంటి వెంకట పద్మనాభం, కూర్మా గణేష్ పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం


బాధితుడి తండ్రికి చెక్కును అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు గురువారం రూ.13 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అంబాజీపేట మండలం వక్కలంక గ్రామానికి చెందిన పితాని ఆనంద నాగబాబుకి వెన్నెముకకు నరానికి మధ్యలో కణితి రావడం వలన నాలుగు సంవత్సరాలుగా లేవలేని పరిస్థితులో ఉన్నారు. తల్లి మృతి చెందడంతో తండ్రి ఒక్కరే నాగబాబు యోగక్షేమాలు చూసుకుంటున్నారు. అయితే తండ్రికి వృద్ధాప్యం కారణంగా ఏ పనికి వెళ్లలేని పరిస్థితి. ఆర్థిక సహాయం కోసం కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెంలో నాగబాబు తండ్రి పితాని వెంకటేశ్వర రావుకి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.13 వేలు చెక్కును అందజేశారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆలమూరు: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మండలంలోని చొప్పెల్ల, ఆలమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. పినపళ్ల, పెదపళ్ల, నర్సిపూడి, నవాబుపేట, గుమ్మిలేరు, మోదుకూరు, పెనికేరు, కలవచర్ల, ఆలమూరు, జొన్నాడ, మూలస్థాన అగ్రహారం, మడికి, చెముడులంక, చొప్పెల్ల తదితర గ్రామాలకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు శుక్రవారం పూజలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహా స్వామివారి ఆలయంలోని ఉపాలయంలో ఉన్న రాజ్యలక్ష్మి తాయారు అమ్మవారి సన్నిధిలో శ్రావణ మాసం తొలి శుక్రవారం పర్వదినాన్ని ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రత కుంకుమ పూజలు ఏర్పాటు చేసినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ గురువారం తెలిపారు. పూజలో పాల్గొనే భక్తులకు అమ్మవారి రూపు, పూజా సామగ్రి, ప్రసాదం దేవాలయంలో ఉచితంగా అందజేస్తామని ఏసీ అన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా శ్రావణ మాసం ప్రారంభం రోజు తొలి శుక్రవారంతో పాటు ఆగస్టు ఒకటో తేదీ, 8వ తేదీ, 15వ తేదీ, 22వ తేదీలలో వచ్చే శుక్రవారాలలో కూడా వరలక్ష్మీ వ్రత కుంకుమ పూజలు నిర్వహిస్తామని ఏసీ ప్రసాద్ పేర్కొన్నారు.

విధిగా పన్ను చెల్లించాలి

అమలాపురం టౌన్: విధిగా ఆదాయ పన్ను చెల్లిస్తే దేశ ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు అవుతారని అమలాపురం ఐటీవో జనిపల్లి ఓం కృష్ణ సూచించారు. ఆదాయ పన్ను దినోత్సవం సందర్భంగా స్థానిక విద్యానిధి స్కూలులో గురువారం నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఐటీవో ఓం కృష్ణతోపాటు, ఇతర ఐటీ ఆఫీసర్లు పన్నుల అభివృద్ధికి తోడ్పడే విషయాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆదాయ పన్నుల చెల్లింపులపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి అవగాహన కల్పించారు. విజేతలకు విద్యాబోధనకు ఉపయోగపడేలా బహుమతులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం స్కూలు ఆవరణలో ఐటీవో మొక్కలు నాటారు.

పౌష్టికాహారం కిట్ల పంపిణీ

అమలాపురం టౌన్: పట్టణ వాసవీ జాగృతి క్లబ్ అధ్యక్షుడు పసలపూడి సతీష్ ఆధ్వర్యంలో పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు గురువారం చేపట్టారు. స్థానిక ఎస్‌కే వృద్ధాశ్రమానికి రెండు సీలింగ్ ఫ్యాన్లు, సిమెంట్ బెంచీలు సమకూర్చారు. హెచ్ఐవీ బాధిత పిల్లలకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. స్థానిక శ్రీహరి మనో వికాస దివ్యాంగుల కేంద్రంలో మెడికల్ కిట్లు, క్లీనింగ్ సామాగ్రి సమకూర్చారు. పేదవైశ్య కుటుంబాలకు కిరాణా సామాగ్రి పంపిణీ చేశారు. తన కుమారుడి జన్మదినం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

ఉత్తమ సేవలకు మంచి గుర్తింపు

అంబాజీపేట: విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్ది ఉపాధ్యాయ వృత్తిలో ఉత్తమ సేవలందించిన వారి మంచి గుర్తింపు లభిస్తుందని హెచ్ఎం కడలి సాయిరామ్ అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో వివిధ సబ్జెక్టులలో విధులు నిర్వహించి బదిలీపై వేరే జెడ్పీ హైస్కూళ్లకు వెళ్లిన 12 మంది ఉపాధ్యాయులను గురువారం సన్మానించారు. 8 ఏళ్ల పాటు పాఠశాలలో విధులు నిర్వహించి విద్యాబుద్ధులను నేర్పిన 12 మందిని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

ఘనంగా చండీ హోమం

ఆలమూరు: చింతలూరులో ఉన్న నూకాంబిక అమ్మవారి ఆలయంలో గురువారం వైభవంగా చండీహోమం నిర్వహించారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య జరిగిన ఈకార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అన్నసమారాధన జరిగింది. అమ్మవారి ఆలయ ఆవరణలో ప్రతి నెల అమావాస్య రోజున చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఈఓ ఉండవల్లి వీర్రాజు చౌదరి తెలిపారు.